క్లుప్తంగా

ఎంవీఆర్‌లో ముగిసిన 'సైఫెస్టా-2కె23'


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

గాజువాక : స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన సైఫెస్టా-2కె23 కార్యక్రమం శుక్రవారం ముగిసింది. పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు స్టాళ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే రీజనింగ్, క్రిటికల్ థింకింగ్ తదితర అంశాలను పెంపొందించుకోవడానికి ఇది సరైన వేదిక అని అన్నారు. పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ ఆవశ్యకతను ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సౌజన్య వివరించారు. కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలపై ప్రత్యేక దృష్టి


పోలింగ్ బూత్ అధ్యక్షులతో మాట్లాడుతున్న పరిశీలకుడు సాయిరామ్

గాజువాక/పెదగంట్యాడ : ఓటరు జాబితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ పరిశీలకుడు సాయిరామ్ ఆ పార్టీ గాజువాక నాయకులకు సూచించారు. అన్ని పోలింగ్ బూత్‌లలోని ఓటరు జాబితాల్లో ప్రతీ పేజీకి ఒక అధ్యక్షుడిని నియమించాలన్నారు. ఢిల్లీ నుంచి గాజువాక వచ్చిన ఆయన ఇక్కడి పార్టీ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావుతో కలిసి 65వ వార్డులోని వివిధ పోలింగ్ బూత్‌ల అధ్యక్షులను శుక్రవారం కలిశారు. బీజేపీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు శర్మ, అప్పారావు, నాగేశ్వరరావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం


కార్పొరేటర్ వంశీరెడ్డిని సత్కరిస్తున్న పెదకోరాడ గ్రామస్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డులో పెదకోరాడ వద్ద వంతెన నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ వంశీరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇక్కడ రూ.11 లక్షలతో వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. సిద్ధేశ్వరం రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో పైప్ లైన్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నందున, అక్కడి పైప్‌లైన్‌ను తొలగించి వంతెన నిర్మాణం చేపట్టామన్నారు. స్థానికులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు.

'అంబేడ్కర్ కళాక్షేత్రం కమిటీపై దుష్ప్రచారం'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రం కమిటీపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని కమిటీ కార్యదర్శి డొక్క నర్సింగరావు తెలిపారు. కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కార్యవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పారదర్శకతతో పని చేస్తున్నామన్నారు. దీపావళి బాణసంచా అమ్మకం కోసం కోపరేటివ్‌కు ఈ నెల 3 నుంచి 13వరకు బిల్డింగ్‌ను మాత్రమే అద్దెకు ఇచ్చామన్నారు. ఖాళీగా ఉన్న గ్రౌండ్ కోసం కొందరు చిరు వ్యాపారులు అడగ్గా వారి వ్యాపారం స్థాయి బట్టి రూ. 500 నుంచి రూ. 1500 వరకు అద్దెకు ఇచ్చి రసీదులు ఇచ్చామన్నారు. దుష్ప్రచారాలు ఆపకపోతే, వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనలో దేశానికే ఆదర్శం


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు


సమావేశానికి హాజరైన ప్రజలు

- హామీలన్నీ అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రిదే
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 65వ వార్డు బాపూజీ కాలనీలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెదగంట్యాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అర్హతే ప్రాతిపదికగా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన సీఎందే అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా 65వ వార్డు బాపూజీ కాలనీ సచివాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సచివాలయ పరిధిలో రూ.28 కోట్లతో చేపట్టిన సంక్షేమ పథకాలను తెలియజేసేలా డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ముందుగా వికాస్ నగర్ జంక్షన్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలవుతున్నాయని, భవిష్యత్తులోనూ ఇదే తరహాలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, నాయకులు మార్రువూడి పరదేశి, లోకనాథం, నాగిశెట్టి శ్రీను, మంగునాయుడు, దేముడు, జుత్తు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


64వ వార్డు యారాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ధర్మాల శ్రీను

యారాడలో జోరుగా ఇంటింటి ప్రచారం

64వ వార్డు యారాడ గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ మేరకు ఆయన ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వారికి చేకూర్చిన లబ్ధి గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వెంకట అప్పారావు, భరత్, తొత్తర విశ్వతేజ, తొత్తర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం


1002వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటం ప్రతీ ఒక్కరిని కదిలిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. సంఘటితంగా పోరాడి, పరిశ్రమను రక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1002వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు 11 ఫిర్యాదులు

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి 11 మంది ఫోన్ చేసి డిపో మేనేజర్ వి.ప్రవీణకు పలు సమస్యలను తెలియజేశారు. ముందుగా అక్కిరెడ్డిపాలేనికి చెందిన రాధాకృష్ణ అనే వ్యక్తి 38 రూట్ బస్ సర్వీస్‌ను గంట్యాడ నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు నడిపించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎం ప్రవీణ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో తాము ఒకసారి పరిశీలించి, అక్కడ బస్ సర్వీస్ అవసరమనుకుంటే తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గాంధీనగర్ నుంచి అప్పలనాయుడు అనే వ్యక్తి ఫోన్ చేసి 38డీ/హెచ్ బస్ సర్వీస్‌ను గాంధీనగర్, వినాయకనగర్, అమరావతినగర్ ప్రాంతాల మీదుగా జగ్గు జంక్షన్ వరకు నడపాలని కోరారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించారు. ఇలా పలువురు తమకు అవసరమైన బస్సు సర్వీస్‌లపై విన్నవించారు.

స్టీల్‌ప్లాంట్ సమాచారం

ప్రసాద్‌కు అభినందనల వెల్లువ


ప్రసాద్‌ను అభినందిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్ ఘంటసాల వెంకట నాగాంబిక ప్రసాద్‌ను ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అభినందించారు. పీఈఎస్‌బీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) ఇంటర్వ్యూలో ప్రసాద్ ఎంపికైన సందర్భంగా సీ నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రసాద్ స్టీల్‌ప్లాంట్‌లో 1987లో సీనియర్ ట్రైనీగా చేరి అంచెలంచెలుగా డైరెక్టర్ (కమర్షియల్)గా ఎదగడం తెలుగు వారికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, నరసింహ, నాయక్, రాజా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల అభినందనలు

నూతన డైరెక్టర్‌గా ఎంపికైన జి.వి.ఎన్. ప్రసాద్‌ను స్టీల్ సీఐటీయూ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి.దాస్, పి.శ్రీనివాసరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు సహకరించాలని వినతి


స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న తలపెట్టిన సదస్సుకు ఉక్కు యాజమాన్యం సహకరించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బయ్యే మల్లయ్య, బి.తాడన్న, ఓబీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను శుక్రవారం కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ తెన్నేటి ఆడిటోరియంలో ఆ రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి 5.30 వరకు 'ప్రభుత్వ రంగ సంస్థలు - రిజర్వేషన్లు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, రాష్ట్ర అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్ సలహాదారు ఆళ్ల వెంకటేశ్వర్లు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ తదితరులు హాజరవుతున్నారని తెలియజేశారు. ఆడిటోరియంతో పాటు అతిథుల వసతికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్. చిత్రంలో డీఆర్వో మోహన్‌కుమార్,ఎస్‌డీసీ లక్ష్మారెడ్డి

మహారాణిపేట : జిల్లాలో తప్పులు లేని సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాపై అసెంబ్లీ నియోజకవర్గ పరిధి లోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సిరిపురం వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలన్నారు. అన్ని వివరాలు సరిపోయాయి అనుకున్నాకే ఓట్లను తొలగించాలని సూచించారు. బీఎల్వోలు ఓటు సవరణలు ఈఆర్వో ఆన్‌లైన్‌లో తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల వారీగా ఉన్న సున్నా డోర్ నంబర్ ఓట్లు ఎన్ని గుర్తించారు, ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కేసులు, 100 సంవత్సరాలు పైబడిన వారి కేసులు ఎన్ని, పరిశీలించినవి ఎన్ని, ఇంకా పరిశీలించాల్సిన సంఖ్య తదితరాలపై తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్‌కుమార్, ఎస్‌డీసీ లక్ష్మారెడ్డి, తహసీల్దార్లు, బీఎల్వోలు, సూపర్ వైజర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు దాడి వెంకటరమేష్ తెలిపారు. శనివారం సాయంత్రం అక్కిరెడ్డిపాలెం వాటర్ ట్యాంక్ వద్ద గల కుంచమాంబ, దుర్గమాంబ ఆలయం నుంచి శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి, నాతయ్యపాలెంలోని సీఎస్ఆర్ కల్యాణమండపం ఆవరణలో ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

క్రిస్మస్ కేక్ తయారీ ప్రారంభం


కేక్ మిశ్రమాన్ని కలుపుతున్న చెఫ్‌లు

గాజువాక : స్థానిక బెస్ట్ వెస్టర్న్ రామచంద్ర హోటల్‌లో 25 కేజీల క్రిస్మక్ కేక్ తయారీకి శుక్రవారం శ్రీకారం చుట్టారు. 18 రకాల డ్రై ఫ్రూట్స్, 20 లీటర్ల లిక్కర్, దాల్చిన చెక్క, మిరియాలు, లవంగాలు కలిపిన మిశ్రమాన్ని ఒక టిన్‌లో భద్రపరిచారు. వారానికి ఒకసారి పరిశీలించి డ్రై అయిన తరువాత దానిలో అవసరం మేరకు జ్యూస్ కలపనున్నట్టు హోటల్ చెఫ్‌లు తెలిపారు. డిసెంబర్ 18న దాన్ని బయటకు తీసి కేక్ తయారీకి అవసరమైన మైదా, ఇతర పదార్థాలను అందులో కలిపి మళ్లీ భద్రపరుస్తారు. క్రిస్మస్ రోజు రకరకాల సైజులలో తయారు చేసి వీఐపీలకు, హోటల్‌లో బస చేసిన అతిథులకు, రెస్టారెంట్‌కు విచ్చేసినవారికి అందజేయనున్నట్టు తెలిపారు. హోటల్ జనరల్ మేనేజర్ నవీన్ పర్యవేక్షణలో చెఫ్‌లు రమణ, సతీష్, శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆటో డ్రైవర్లకు జైలు శిక్ష

కూర్మన్నపాలెం: దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ముఖ్య కూడళ్ల వద్ద నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 15 మంది మందుబాబులపై కేసు నమోదైంది. వారికి విశాఖపట్నం 1వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సుమారు 80వేల రూపాయలు జరిమానా విధించినట్లు దువ్వాడ ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి తెలిపారు. వీరిలో మద్యం సేవించి ఆటో నడిపిన కొండ కృష్ణకు 3 రోజులు, బెవర రాజేంద్రకు 7 రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలియజేశారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి ఇబ్బందులను కొనితెచ్చుకోవద్దని గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ యూసఫ్ విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనాలు నడపాలంటే 18ఏళ్ల వయసు నిండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. నాణ్యమైన హెల్మెట్‌నే ధరించాలని సూచించారు. రాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడవద్దని హితవు పలికారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ ఆదేశాల మేరకు గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయుడు భాస్కరరావు, సిబ్బంది నాగేశ్వరరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలు ప్రారంభం


ఆదర్శగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడాకాలనీలోని ఆదర్శ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా విక్రయాల దుకాణాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శబ్దకాలుష్యం లేకుండా, వాతావరణం కాలుష్యం కాకుండా టపాసులు కాల్చాలని కోరారు. జీవీఎంసీ, పోలీసు శాఖ, అగ్నిమాపక దళ శాఖ అనుమతులతో ఇక్కడ 50 దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతీ దుకాణం వద్ద డ్రమ్ములతో నీళ్లు, ఇసుక ఉండేలా చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

చిత్రలేఖనంలో విద్యార్థులకు బంగారు పతకాలు


విద్యార్థులకు, ఉపాధ్యాయుడికి పతకాలు అందిస్తున్న గాజువాక హైస్కూల్ హెచ్ఎం విజయ ప్రశాంతి


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్ఎం కాంతం, డ్రాయింగ్ టీచర్

గాజువాక : అనకాపల్లి జిల్లా చోడవరంలోని చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 6వ ఆలిండియా చిత్రలేఖన పోటీల్లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. ఈ పోటీల్లో పాల్గొన్న 30 మంది విద్యార్థుల్లో ఆరుగురు బంగారు పతకాలను సాధించారు. మిగిలిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు లభించినట్టు పాఠశాల చిత్రలేఖనోపాధ్యాయుడు ఎస్.ఎన్.భావనారుషి తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిత్రలేఖనంలో చేస్తున్న కృషికి గాను చిత్రకళా పరిషత్ నిర్వాహకుడు భావనారుషికి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అక్కిరెడ్డిపాలెం: ఎనర్జీ కన్వర్షన్ అంశంపై ఎన్టీపీసీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎన్టీపీసీలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొనగా గ్రూప్ ఏ నుంచి 55 మందిని, గ్రూప్ బీ నుంచి 55 మందిని స్పాట్ పెయింటింగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు డ్రాయింగ్ టీచర్ బి.రవిచంద్ తెలిపారు. గ్రూప్ ఏ విభాగంలో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ నుంచి 7వ తరగతి విద్యార్థిని కె.తేజశ్రీ, 6వ తరగతి విద్యార్థిని ఎం.హాసినీ ప్రియ, గ్రూప్ బీలో 10వ తరగతి విద్యార్థినులు ఫలక్ నాజ్, బి.చంద్రకళ ఎంపికయ్యారని తెలియజేశారు. వారికి నవంబర్ 14న ఎన్టీపీసీ సింహాద్రినగర్‌లో స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు కుమార స్వామి తదితరులు అభినందించారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న బ్రాంచ్ మేనేజర్

అగనంపూడి: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 105వ వార్షికోత్సవాన్ని అగనంపూడి బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్యామ్‌ప్రసాద్ కేక్ కట్‌చేసి ఖాతాదారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 8019 బ్రాంచ్‌లతో యూనియన్ బ్యాంక్ నడుస్తోందన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. మేనేజర్ శ్యామ్‌ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ ఎల్.శృతిలను ఖాతాదారులు సత్కరించారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, బ్యాంక్ సిబ్బంది, స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు నెల్లి శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు లీలా కుమారి, శ్రీదేవి, జలావతి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు సహించం

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి
- రేషన్ పంపిణీ వాహనాలు, డిపోల తనిఖీ

మహారాణిపేట: రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావుతో కలిసి ఆయన నగరంలోని పలు రేషన్ డిపోలు, రేషన్ సరకుల పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా కంచరపాలెం ఏరియాలో రేషన్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేసి, బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్డుదారులతో మాట్లాడి రేషన్ పంపిణీలో సమస్యలపై ఆరా తీశారు. షీలానగర్‌లోని రేషన్‌డిపోను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. మిందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, కోడిగుడ్ల రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్ పరిశీలించగా 1800 కోడిగుడ్లు అధికంగా ఉన్నాయని, హెచ్ఎం వివరణ తీసుకుని పంపాలని డీఈవోను లక్ష్మీరెడ్డి ఆదేశించారు. మల్కాపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం వడ్లపూడిలో ఎంఎల్ఎస్ గొడౌన్‌ను తనిఖీ చేశారు. ఏఎస్‌వోలు జి.మురళీనాథ్, టి.కృష్ణ, సీడీపీవో నీలవేణి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరి, ఆర్‌ఐలు పాల్గొన్నారు.